Namasthe Telangana

# 2024 అటవీ పోస్టులు

- టీఎస్‌పీఎస్సీ ద్వారా త్వరలోనే భర్తీ
- ఖాళీల వివరాలు అడిగిన ముఖ్యమంత్రి
- నివేదిక సమర్పించిన అధికారులు
- అటవీశాఖలో పదేండ్లుగా సగానికి సగం ఖాళీలే

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

అటవీశాఖలో భారీగా ఉన్న ఖాళీలను భర్తీ చేయడానికి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పచ్చజెండా ఊపారు. ఏయే క్యాటగిరీల్లో ఎన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయనే వివరాలతో తాజా నివేదిక పంపాలని ఆయన ఆదేశించడంతో ఉన్నతాధికారులు సమగ్ర నివేదికను సమర్పించారు. ఇక ఆయా ఉద్యోగాల భర్తీ ప్రక్రియ త్వరలో మొదలుకానున్నది. ఈ పోస్టులను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ద్వారా భర్తీ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. దీనికోసం అటవీశాఖ సర్వీస్‌రూల్‌లో చిన్న మార్పు చేయాలని నిర్ణయించామన్నారు. అటవీశాఖలో చాలా ఏండ్లుగా సగానికి సగం ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలో మొత్తం ఉన్నత స్థాయి నుంచి కింది స్థాయి అధికారులు, ఉద్యోగుల వరకు వివిధ క్యాటగిరీలలో సుమారు ఐదు వేల పోస్టులుండగా, వాటిలో

(మిగతా 6వ పేజీలో)

# 2024 అటవీ పోస్టులు

(మొదటి పేజీ తరువాయి)

దాదాపు 2200 ఖాళీగా ఉన్నాయి. గత పదేండ్లుగా ఇదే పరిస్థితి. కొన్ని కీలక విభాగాలు పూర్తిగా ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ద్వారా నడుస్తున్నాయి. తమ శాఖలో కనీస సంఖ్యలో కూడా సిబ్బంది లేకపోవడం వల్ల అడవులను రక్షించడం, అభివృద్ధి చేయడం సాధ్యం కావడంలేదని అధికారులంటున్నారు. అటవీశాఖలో ప్రస్తుతం డిప్యూటీ కన్జర్వేటర్ల స్థాయిలో 4 పోస్టులు, 200 ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు, 616 మంది ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు, 1196 మంది బీట్ ఆఫీసర్లు, 212 అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీనికితోడు ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ స్థాయిలో మొత్తం 65 ఉండగా అందులో మరింతగా 47 పోస్టులు ఖాళీగా ఉండటం గమనార్హం. ఐఎఫ్ఎస్ పోస్టుల భర్తీ బాధ్యత కేంద్రంపై ఉంటుంది. తమ శాఖలో తక్షణం 2024 పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరం ఉందని ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. అటవీశాఖలోని చాలా విభాగాలలో గత పదేండ్లుగా కొన్ని వందల మంది పదవీ విరమణ పొందగా వారి స్థానాలను కొత్త నియామకాల ద్వారా భర్తీ చేయలేదు. ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో కొంతవరకు పనులు వెళ్లదీస్తున్నారు. కంప్యూటర్ ఆపరేటర్లు మొదలుకుని, డ్రైవర్లు, వాచర్లు చాలా మంది అవుట్ సోర్సింగ్‌లోనే పనిచేస్తున్నారు. జీఎస్సీ, ఐటీ వంటి కీలక విభాగాలలో నిపుణులైన వారంతా ఔట్‌సోర్సింగ్ ద్వారా నియమితులైనవారే. తెలంగాణలో దాదాపు 25 లక్షలకుపైగా ఎకరాలలో అడవులుండగా వాటిని రక్షించడానికి కనీస స్థాయి సిబ్బంది లేరు. ఒక్క బీట్ ఆఫీసర్ 5 వేల నుంచి 10 వేల ఎకరాల పరిధిలో అడవుల రక్షణ చూడాల్సి వస్తున్నది. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు 20 వేల నుంచి 30 వేల ఎకరాలలో, ఫారెస్ట్ రేంజ్ అధికారులు దాదాపు లక్ష ఎకరాల విస్తీర్ణంలో రక్షణ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారు. పరిధి అనూహ్యంగా పెరిగిపోవడం వల్ల అడవుల రక్షణపై ఎక్కువ దృష్టి సారించలేకపోతున్నామని అధికారులంటున్నారు. దీనివల్ల కొన్నిచోట్ల అడవుల విధ్వంసాన్ని ఆపలేకపోతున్నామని ఒక ఉన్నతాధికారి చెప్పారు. ఇక చాలా విభాగాలలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు దశాబ్దకాలంగా కీలకమైన సేవలందిస్తున్నా వారిని రెగ్యులరైజ్ చేయలేదు. అడవులకు సంబంధించిన విషయాలను ఎప్పటికప్పుడు గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ ద్వారా పర్యవేక్షించి అధికారులకు ముఖ్యమైన సమాచారం అందించే జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (జీఐఎస్) విభాగంలో, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో మొత్తం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులే కీలకమైన సేవలందిస్తున్నారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ, గూగుల్ ఎర్త్ సహాయంతో అడవుల రక్షణకు సంబంధించి కీలక సమాచారమిస్తున్న విభాగాలలో రెగ్యులర్ సర్వీస్ ఉన్నవారు లేరు. రాష్ట్రంలో పచ్చదనంతోపాటు అడవుల విస్తీర్ణాన్ని పెంచడానికి తెలంగాణకు హరితహారం వంటి కార్యక్రమాలను చేపడుతున్న క్రమంలో ముఖ్యమంత్రి స్వయంగా ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలపై చొరవ తీసుకున్నారు. పోస్టుల వివరాల జాబితాను పంపాల్సిందిగా కోరారని అధికారులు తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు పీసీసీఎఫ్ ప్రశాంత్‌కుమార్ ఝా తాజా నివేదికను ప్రిన్సిపల్ సెక్రెటరీ బీఆర్ మీనాకు పంపారు. అటవీశాఖలో ఎప్పుడైనా పోస్టుల భర్తీ శాఖాపరంగానే జరుగుతుంది. కానీ ఈసారి టీఎస్‌పీఎస్సీ ద్వారానే నియామకాలను చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ క్రమంలో అటవీశాఖ చట్టంలోని సర్వీస్‌రూల్‌ను సవరిస్తూ త్వరలో ఒక జీవోను జారీచేయనున్నారు.

ఐఎఫ్ఎస్ స్థాయిలో పోస్టుల ఖాళీలపై కూడా అధికారులు నివేదికను కేంద్రానికి పంపుతున్నారు. మొత్తం శాఖలో మంజూరైన పోస్టులు 65 కాగా 47 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

**అటవీశాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలు:**

| క్యాటగిరీ | మంజూరైన పోస్టులు | ఖాళీగా ఉన్నవి |
|---|---|---|
| డీసీఎఫ్ | 22 | 8 |
| రేంజ్ ఆఫీసర్లు | 268 | 200 |
| సెక్షన్ ఆఫీసర్లు | 876 | 616 |
| బీట్ ఆఫీసర్లు | 2156 | 1196 |
| అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లు | 1532 | 212 |
| | 4,854 | 2232 |